సాక్షి నిర్మల్



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్



మాట్లాడుతున్న జడ్జి అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: న్యాయపరమైన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు గురువారం చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహ హింస చట్టం, నిర్వహణ చట్టం, ట్రైబల్ రైట్స్‌పై అవగాహన ఉండాలన్నారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి భవిష్య, నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాదులు లింగ గౌడ్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పెంపు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు గ్రూప్–1 ప్రిలిమ్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువు పెంచుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 7వ తేదీ వరకు ఉండగా, దానిని ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆఫ్‌లైన్‌లో లేదా నేరుగా డిగ్రీ కళాశాలలోని బీసీ స్టడీ సెంటర్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9705052825, 9440248316 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళలను గౌరవించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీపీ అరుణ

భైంసాటౌన్: మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని భైంసా కోర్టు ఏపీపీ అరుణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో గురువారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు–న్యాయపరమైన పరిష్కారాలను వివరించారు. విద్యార్థులు మత్తుపదార్థాల సేవనం వంటి వ్యసనాల బారిన పడి పెడదోవ పట్టకుండా చదువుపై దృష్టిసారించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొవిజినల్ జాబితా విడుదల

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో భైంసా బస్తీ దవాఖానాలో వైద్యుని పోస్టు 562/2,2024 నోటిఫికేషన్‌కు సంబంధించి మెరిట్ జాబితా విడుదల చేసినట్లు డీ ఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజు తెలిపారు. జాబితాను nirmaltelangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే అభ్యర్థులు సంబంధి త ధ్రువపత్రాలు జతపరిచి ఈనెల 13వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

- కెరీర్ గైడెన్స్ నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్

నిర్మల్‌ఖిల్లా: జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడేందుకు కావాల్సిన నైపుణ్యాలను మారుతున్న కాలానికనుగుణంగా పెంచుకోవాలని వక్తలు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గురువారం ప్రత్యేక అవగాహనసదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తలుగా రాష్ట్రస్థాయిలో జీకే కరెంట్ అఫైర్స్ నిపుణుడు రమణగౌడ్, జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ నిపుణుడు, పుస్తక రచయిత అల్లం సాయికృష్ణ పాల్గొని డిగ్రీ అనంతరం వివిధ కోర్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగ నియామకాల్లో పోటించాల్సిన మెలకువలను వివరించారు. పోటీ పరీక్షల్లో జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలను ఎదుర్కొనే తీరును ప్రొజెక్టర్‌పై వివరించారు. భావ వ్యక్తీకరణ, సాఫ్ట్‌స్కిల్స్ ఉంటేనే తీవ్రతరమైన పోటీలో రాణించగలుగుతామన్నారు.

ఇల.. కైలాసం



– వివరాలు 11లో

శివరాత్రి వచ్చిందంటే భూమంతా కైలాసమే అవుతుంది. ఎటుచూసినా శివ నామ స్మరణే వినిపిస్తుంది. శుక్రవారం మహాశివరాత్రికి జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహించనున్నారు. శివపార్వతుల కల్యాణోత్సవాలకూ ఏర్పాట్లు పూర్తిచేశారు. అడుగడుగునా శివయ్య గుడులతో జిల్లా భూకైలాసాన్ని తలపిస్తోంది. జిల్లా కేంద్రంలోనూ ఎటుచూసినా ఈశ్వరుడే దర్శనమిస్తుంటాడు. ఓంకారేశ్వర, గుట్ట వీరేశ్వర, రథాలగుడి విశ్వేశ్వర వంటి అరుదైన శైవాలయాలకు అలవాలంగా నిర్మల్‌కు పేరుంది. - నిర్మల్



ఈ చిత్రంలో కనిపిస్తున్న సులోచనమ్మకు 80 ఏళ్లు. జిల్లా కేంద్రంలోని కస్బాగల్లీ. 15వ ఏటనే పెళ్లయ్యింది. 40 యేళ్ల కిందట చెట్టుపై నుంచి పడి భర్త చనిపోయాడు. ఐదుగురు కూతుళ్లు, నలుగురు కుమారులు. ఎవరి పని వాళ్లు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సులోచనమ్మ ఇప్పటికీ వారిపై ఆధారపడటం లేదు. ఎండనక, వాననక.. నిత్యం జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ రోడ్డులో ఇలా పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. 'నాకు చేతనైనన్ని రోజులూ పండ్లు అమ్ముతా..' అంటూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఈ మహిళామూర్తి.



25 ఏళ్ల కిందట ఇచ్చోడ నుంచి నిర్మల్‌కు వలస వచ్చింది 55 ఏళ్ల సుశీల. పదిహేనేళ్లుగా కొబ్బరిబొండాలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. తోడునీడగా ఉండే భర్త ఏడేళ్లక్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి కుటుంబ భారం మోస్తూ ఇద్దరు కూతుళ్లు, కొడుకు పెళ్లి చేసింది. ప్రస్తుతం కొడుకుతో ఉంటూ కోడలితో కలిసి కొబ్బరిబొండాలను విక్రయిస్తోంది. తన కష్టాల్లాగే గట్టిగా ఉండే కొబ్బరిబొండాలను తన శ్రమలాంటి కత్తితో కొట్టిస్తూ జీవనం సాగిస్తోంది.



లక్ష్మవ్వ జిల్లా కేంద్రంలోని గాంధీమార్కెట్లో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. 50 ఏళ్ల కిందటే భర్త చనిపోయాడు. దాదాపు 30 ఏళ్లుగా కూరగాయలు అమ్ముతూ ఐదుగురు కూతుళ్ల పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడంటే మార్కెట్లో అమ్ముతున్నాం కానీ.. ఇంతకుముందు కూరగాయల బుట్టలు నెత్తిన ఎత్తుకుని ఊర్లలో అంగళ్లు తిరుగుతూ అమ్మేదని చెబుతోంది.

అర్ధనారీశ్వరి..

- అన్నింట్లో ఆమె సగభాగం • కఠినమైన ఉద్యోగాల్లో..
- క్లిష్టమైన పరిస్థితుల్లో.. • సత్తా చాటుతున్న అతివలు

నిర్మల్: ఆమె లేనిదే.. భూమి లేదు. అన్నింట్లో ఆమె సగభాగం. చాలా విషయాల్లో ఆమెనే అధికం. వంటింట్లో గరిటలు తిప్పే దగ్గర నుంచి తుపాకులు పట్టుకునే పోలీసు ఉద్యోగాల దాకా.. ఆమె పక్కాగా పనిచేస్తోంది. ఒకప్పటి భయపడే అబలలం కాదు.. ఏదైనా చేస్తామన్న తెగువ చూపే సబలలం అంటోంది. వేదాలను, మహాభారతాన్ని రాసినా.. మనశ్శాంతి కలగని వ్యాసమహర్షికి ఇక్కడి గోదావరమ్మ ఒడ్డున జ్ఞానాన్ని ప్రసాదించి చదువులమ్మ కొలువైన నేలమనది. యుగాల నుంచే అమ్మను పూజిస్తున్న ప్రాంతమిది. ఇప్పటికీ నిర్మల్‌జిల్లా.. అతివల ఖిల్లాగానే కొనసాగుతోంది. జనాభాలోనైనా.. ఓటరు జాబితాలోనైనా.. ఆమెదే పైచేయి. మహాశివుడి అర్ధభాగంగా పూజలందుకుంటున్న వేళ.. మహిళాదినోత్సవం రావడం విశేషం. అర్ధనారీశ్వరీగా అన్నింట్లో సగమంటూ, అందుకు తగ్గట్లు శ్రమిస్తూ.. రాణిస్తూ.. సాధిస్తున్న మహిళామణులెందరో ఉన్నారు.



భరోసా కేంద్రంలో ఎస్పీ జానకీ షర్మిలతో మహిళా కానిస్టేబుళ్లు

ఏదైనా సాధించవచ్చు..



మహిళలు ఎందులోనూ తక్కువ కాదు. ఏ రంగంలోనైనా రాణించవచ్చు. అందుకు తగ్గట్లు అవగాహన, పనిచేసే సామర్థ్యం కలిగి ఉండాలి. ప్రస్తుత సమాజంలో మహిళలకు అడ్డంకులు ఉన్నప్పటికీ వాటిని అధిగవిస్తున్నవారూ ఉన్నారు. జిల్లాలో మహిళలపై వేధింపులను నిర్మూలించడానికి శాఖాపరంగా కృషిచేస్తున్నాం.

– డాక్టర్ జానకీషర్మిల, ఎస్పీ

నారీశక్తి చాలా గొప్పది..



మహిళలు తలుచుకుంటే ఏ పనినైనా విజయవంతంగా పూర్తిచేయగలరు. వంటింటి నుంచి అంతరిక్షం దాకా మహిళలు ఎదిగారు. జిల్లా నుంచే గత రెండేళ్లుగా తమ రంగాల్లో రాణిస్తూ ఢిల్లీకి వెళ్లి అవార్డులను అందుకున్నారు. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మహిళలు రాణించేలా కృషిచేస్తున్నాం. మహిళ అధికారిగా నేనుసైతం ఉన్నతాధికారుల సహకారంతో పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టగలిగాను.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

అందరికోసం నేను..



ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. నేను సమాజానికి ఉపయోగపడే యూనిఫాం జాబ్‌లో ఉండాలన్నది మానాన్న నరేందర్ కోరిక. అందుకే పోలీస్‌జాబ్ ఎంచుకున్నాను. ఇష్టంతో కష్టపడితే మహిళలు ఏదైనా సాధించవచ్చు.

– ఎస్.రవళి, కానిస్టేబుల్, నిర్మల్

నాకూ ముగ్గురమ్మాయిలే..



చిన్నప్పటి నుంచి సమాజం కోసం శ్రమించాలన్న లక్ష్యంతో ఉండేదాన్ని. చివరకు పోలీసుశాఖలోకి వచ్చాను. ఇబ్బందులు అధిగమిస్తూ ప్రజాసేవ చేస్తున్నాం. నాకూ ముగ్గురు అమ్మాయిలే. వాళ్లూ చదువుల్లో బాగా రాణిస్తున్నారు. సమాజంలో ఆడ, మగ అందరూ సమానమే అన్న తీరు ఇంకా రావాలి.

– రమాదేవి, కానిస్టేబుల్

సమాజానికి సేవచేయాలనే..



సమాజంలో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరికీ సమన్యాయం ఉండాలన్న అభిప్రాయం నాది. ఇదే క్రమంలో సమాజసేవ చేసేందుకు పోలీసుశాఖలోకి వచ్చాను. ఇందుకు భర్త రామకృష్ణ ప్రోత్సాహం ఉంది. ప్రస్తుతం భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నాం.

– సుమలత, ఎస్సై, భరోసాకేంద్రం

ఆమెకు ప్రాతినిధ్యమేది..?

- చట్టసభల్లో మహిళలు అంతంతే
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా తక్కువే
- రాజకీయాల్లో ఉన్నా పదవులు అందని ద్రాక్షే
- 33శాతం మహిళా కోటాతో ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అన్నింటా ఆమె సగం అనే మాటలు చట్టసభల అవకాశాల్లో అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. కీలకమైన శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం అసమానతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లా జనాభా, ఓటర్ల పరంగా చూస్తే మగవారితో సమానంగా.. ఇంకా సరిగ్గా చెప్పాలంటే కొన్ని చోట్ల మహిళలే అధికంగా ఉన్నారు. కానీ చట్టసభలకు ఆమడదూరంలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం మహిళలకు టికెట్లు ఇచ్చి ప్రోత్సహించడమే కరువైంది.

అందని అవకాశాలు..

73ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పది అసెంబ్లీ స్థానాల్లో ప్రతీ ఐదేళ్లకోసారి సగటున 15మంది చొప్పున సుమారు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో మొత్తంగా ఏడుగురే మహిళా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ముగ్గురు రెండు సార్లు గెలిచారు. ఇక పెద్దపల్లి, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 36మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 1998, 1999 ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున డాక్టర్ సుగుణకుమారి ఎంపీగా ఎన్నికయ్యారు. మిగతా ఏ ఒక్కరికి అవకాశం దక్కలేదు. ఆదిలాబాద్ లోక్‌సభ నుంచి మహిళ ఎన్నిక కాలేదు.

33శాతం కోటా అమలైతే

గత సెప్టెంబర్‌లో కేంద్రం చట్టసభల్లో 33శాతం సీట్లు మహిళలకు రిజర్వు చేసే 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడితే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టం అమలులోకి వస్తే పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు మహిళలకే దక్కనున్నాయి. ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను ఒకటే జనరల్ స్థానం ఉండనుంది. భవిష్యత్తులో మహిళా నాయకులకు అవకాశం మెరుగుపడనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో స్త్రీ-పురుష ఓటర్లు

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
సిర్పూర్	1,14,484	1,14,359	12	2,28,855
చెన్నూర్	95,974	97,264	07	1,93,245
బెల్లంపల్లి	86,802	88,530	13	1,75,345
మంచిర్యాల	1,38,472	1,40,559	25	2,79,056
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16	2,26,582
ఖానాపూర్	1,09,508	1,14,445	13	2,23,966
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్	1,21,070	1,35,057	20	2,56,147
ముథోల్	1,23,208	1,30,378	18	2,53,604
మొత్తం	11,23,515	11,67,603	132	22,91,250

అవకాశాలు ఇవ్వాలి



రాజకీయంగా ఎంతోమంది మహిళలు కష్టపడుతున్నా వారికి తగిన అవకాశాలు రావడం లేదు. డబ్బు, హోదా ఉన్న మగవారి ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారాలి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తుందనే భరోసా ఉంది.

– రామిళ్ల రాధిక, కాంగ్రెస్ నాయకురాలు

మహిళా బిల్లుతో మేలు



భవిష్యత్‌లో మహిళా బిల్లుతో చట్టసభల్లో అవకాశాలు మెరుగుపడనున్నాయి. 33 శాతం కంటే 50శాతం అమలు చేస్తే అందరికీ సమాన అవకాశాల ఇచ్చినట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– అమురాజుల శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి

స్వీప్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



మహిళలు వేసిన ముగ్గును తిలకిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వందశాతం ఓటింగ్ నమోదు దిశగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు గురువారం ముగ్గుల పోటీలు, మెహిందీ పోటీలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి తిలకించారు. వివిధ రూపాల్లో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లను చైతన్యవంతులు చేసేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కలెక్టరేట్‌తోపాటు మండల కేంద్రాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించామని డీఆర్డీవో విజయలక్ష్మి తెలి పారు. కార్యక్రమంలో డీఆర్వో గంగయ్య, మహిళలు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

లక్ష్మణచాంద: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో గురువారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఎంపీపీ అడ్వాల పద్మతో కలిసి డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పొట్టపెల్లికే గ్రామానికి చెందిన ప్రశాంతి మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడారు. పురుషులతో సమానంగా అన్నిరంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. తల్లిదండ్రులు కొడుకులతో సమానంగా కూతుళ్లను పెంచాలని పేర్కొన్నారు. ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలబడేలా తల్లిదండ్రులు వారిని ఉన్నత చదువులు చదివించి జీవితంలో స్థిరపడేలా ప్రోత్సహించాలని తెలిపారు. సందర్భంగా డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ జానకిని ఎంపీపీ అడ్వాల పద్మ ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ అడ్వాల పద్మ, మహిళలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మ,జెడ్పీటీసీ ఒస రాజేశ్వర్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో సాయిప్రసాద్, డీడబ్ల్యూవో నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీలను పూజించే సంస్కృతి మనది

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: స్త్రీలను పూజించే సంస్కృతి మనదని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. మహిళ పోలీసులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని మహిళా పోలీసులకు, సిబ్బందికి మహిళా దినోత్సవం సందర్భంగా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... అనేక రంగాల్లో మహిళలు తిరుగులేని నాయకత్వం వహిస్తున్నారన్నారు. ప్రతీ మహిళ అన్నిరంగాల్లో సమానత్వం సాధించాలని అభిలషించారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనుస్ అలీ, ఆర్‌ఐ శైలేందర్, పట్టణ సీఐ అనిల్ పాల్గొన్నారు.

అటవీ భూమి స్వాధీనం

కుభీర్: మండలంలోని మాలానగర్ అటవీ ప్రాంతం అటవీ భూమిని షేక్ అలీం, షేక్ మునీర్ ఆక్రమించి సాగుచేసుకుంటున్నారు. అలీం రెండెకరాలు, మునీర్ ఎకరంనర సాగు చేస్తున్నారు. ఈమేరకు ఫిర్యాదు అందడంతో అన్యాక్రాంతమైన భూమిని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సెక్షన్ ఆఫీసర్ జాదవ్ కోటేశ్ తెలిపారు. ఈ స్థలాన్ని ప్లాంటేషన్‌కు వినియోగిస్తామని పేర్కొన్నారు.

బాసర ఆలయంలో కాగ్ ఆడిట్



భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయంలో గురువారం కాగ్ ఆడిట్ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆలయ రికార్డులను ఆడిట్ సభ్యులు పరిశీలిస్తున్నారు. పదేళ్లపాటు ఆలయ లెక్కలు, ఇతర వివరాలు, అమ్మవారి భూములు, ఆభరణాలపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆలయ అధికారుల సమక్షంలో రికార్డులు నిశితంగా పరిశీలిస్తూ పదేళ్లుగా ఆలయానికి వస్తున్న ఆదాయం, ఇతర వ్యయాల వివరాలు తెలుసుకుంటున్నారు. భక్తులు సమర్పించే కానుకలు, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయ మార్గాల వివరాలు పరిశీలిస్తున్నారు. మరికొన్ని రోజులపాటు ఆడిట్ జరుగనుంది. పూర్తిస్థాయిలో ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించనున్నారు. పదేళ్లకాలంలో ఆలయ ఆస్తులు, అమ్మవారికి సమర్పించిన బంగారు ఆభరణాలు, బ్యాంకు లాకర్లలో ఉన్న డాక్యుమెంట్లు, వ్యవసాయ భూములు ఇలా అన్ని వివరాలను ఆడిట్ బృందం పూర్తిస్థాయిలో సేకరించనుంది.

క్లుప్తంగా

బాసర ఆలయంలో బహిరంగ వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

భైంసా: బాసర ఆలయంలో గురువారం కార్యనిర్వహణాధికారి కార్యాలయ ఆవరణలో దేవస్థాన వ్యవసాయ భూములు వివిధ హక్కులకు బహిరంగ వేలం నిర్వహించారు. బాసర గ్రామ శివారులో రైల్వేస్టేషన్ సమీపంలో సర్వే నెం.538/3లోని 4.27 ఎకరాల వ్యవసాయ భూమి కౌలు నిమిత్తం ఏడాది కాలపరిమితికి రూ.27000లకు హెచ్చు పట్టాదారు మనోహర్ దక్కించుకున్నారు. బాసర గ్రామ శివారులో గోదావరి దారి సర్వే నెం.438లోని 18.19 ఎకరాల వ్యవసాయ భూమి సాగు కౌలు నిమిత్తం ఏడాది కోసం రూ.3,62,000లకు హెచ్చు పట్టాదారు పి.సుజిత్ దక్కించుకున్నాడు. దేవస్థాన పేరు ముద్రించిన సాదా కండువాలు జాకెట్ ముక్కల సరఫరాను అనంతుల కేదారి క్లాత్ స్టోర్స్ వరంగల్, ఒడి బియ్యంలో వచ్చిన ఎండు కుడుకలు, బాదాములు, బరిడి పోకలు, పసుపు కొమ్ములు వగైరా ప్రోగు చేసుకునే హక్కును గాదేవార్ గోపి దక్కించుకున్నారు.

వాయిదా పడింది...

అమ్మవారి రోజువారి అలంకరణ కోసం విడి పూలు, పూలదండలు ద్వారముల తోరణాలు, గజమాల సరఫరా చేయడంతో పాటు లక్ష్మి సదనము వెనుక గల తాత్కాలిక షాప్ నెంబర్ 3,4,5 సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగులో సస్యరక్షణపై అవగాహన

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్‌లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులకు సస్య రక్షణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. డివిజనల్ అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ దిలావర్‌పూర్ పరిసరాల్లో మాజీ హార్టికల్చర్ రాష్ట్ర కమిషనర్ తోటలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట సస్యరక్షణ చర్యలతోపాటు, యాజమాన్య పద్ధతులు అవలంభించడంతో మరో ఏడాదిలో ఫలసాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు దీనిని ఆదర్శంగా తీసుకుని తమ సాగులో మొలకువలను పాటించి పంట సాగులో సస్యరక్షణ చర్యలు, సరిమైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలని సూచించారు. ఫలసాయంలో వచ్చే గెలల తీత, వాటి నిల్వపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం ... నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన పోసాని (60) తన కుమారుడైన అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి నిర్మల్‌కు వస్తోంది. గాజులపేట్ వద్ద మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు కిందపడిపోయారు. అరుణ్ చేతికి స్వల్ప గాయాలయ్యాయి. పోసాని తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడికి రిమాండ్

కుభీర్: మండలంలోని ఓ పాఠశాలలో వ్యాయామ(పీఈటీ) ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ విద్యార్థులకు వ్యాయామం చేయించే సందర్భంలో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు కత్తి సాగర్‌ను ఈ నెల 5న అరెస్ట్ చేశారు. అయితే గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పి.రవిందర్ తెలిపారు.

జయహో నారీ



- సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు
- అన్ని రంగాల్లో చెరగని ముద్ర
- నేడు ప్రపంచ మహిళా దినోత్సవం

నేటి ఆధునిక యుగంలో మహిళలు వంటింట్లోనే కాదు.. సమాజంలోనూ ప్రత్యేకత చాటుతున్నారు. పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారు. స్వయంగా ఆర్థిక స్వాలంబన సాధిస్తూ, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కూలీ పని నుంచి మొదలుకొని అంతరిక్ష ప్రయోగాల వరకూ వారిపాత్ర ఎనలేనిది.. అయినప్పటికీ కొంత వివక్ష ఎదురుకుంటూనే ఉన్నారు. వాటి అంతరాలను తెంచుకుని రానున్న కాలంలో మరింతగా ముందుకు సాగాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం..

సాగులో మేటి శిరీష



శిరీష, మహిళా రైతు

లోకేశ్వరం: లోకేశ్వరం మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మగ్గిడి శిరీష సాగులో తనకంటూ ఓ గుర్తింపు సాధించింది. భర్త సాయారెడ్డి కూడా రైతే కావడంతో ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని రకాల పంటల సాగులో రాణిస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు పురుషోత్తంరెడ్డి (7వ తరగతి), చిన్నకుమారుడు ముత్యంరెడ్డి (5వ తరగతి). ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో 15ఏళ్లుగా శిరీష బెండ, టమాట, బీరకాయ, ఉల్లిగడ్డ, కొత్తిమీర, బీన్నిస్‌కాయ, చిక్కుడుకాయ, వరి, మిర్చి, జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేస్తోంది. డ్రిప్ విధానం సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తుండడం విశేషం. శిరీష కొంత మేరకు చదువుకోగా ఆమె భర్త సాయారెడ్డి డీగ్రీ పూర్తిచేశాడు. అయిప్పటికీ వ్యవసాయ, ఉద్యాన వన అధికారిల సహకారంతో పంటలు సాగు చేస్తున్నారు.



ఎద్దుల బండితో శిరీష

కూతురునే కుమారుడిగా..



తల్లిదండ్రులతో సక్రపు శైలజ

కుంటాల: మహిళలను పూజించాలనే ధ్యేయంతోనే కూతురు చాలు అనుకున్నారు. కూతురులోనే కుమారుడుని చూసుకుంటూ అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు కుంటాల మండల కేంద్రానికి చెందిన సక్రపు ప్రమీల-గజేందర్ దంపతులు. గజేందర్ కుంటాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా భార్య ప్రమీల గృహిణిగా వ్యవహరిస్తుంది. వీరి కూతురు సక్రపు శైలజ. ఒకతే కూతురు. ఉన్నత చదువులు చదివించడంతో వైద్య విద్యలో నీట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 1500 ర్యాంక్ సాధించింది. సిద్దిపేట ఆర్వీఎం మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొంది వచ్చే మార్చిలో పూర్తి చేసుకోనుంది. శస్త్ర చికిత్స నిపుణురాలుగా ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో చదువుతున్నానని శైలజ చెబుతోంది.

ట్రిపుల్‌ఐటీలో మహిళా దినోత్సవం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందితసేతి మాట్లాడుతూ సుధామూర్తిలాంటి గొప్ప మహిళల విజయగాథలన్నింటిని తెలుసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ రంగంలో మహిళలు రాణించాలని సూచించారు. సవాళ్లను అధిగమించడానికి పరిమితుల నుంచి విముక్తి పొందడానికి కొత్త అవకాశాలను స్వీకరించేందుకు సిద్ధం కావాలని సూచించారు. కేరీర్‌తోపాటు కుటుంబాన్ని సమతుల్యం చేసుకుంటూ మహిళలు ఒత్తిడిని అధిగమిస్తూ అన్నిరంగాల్లో రాణించాలని తెలిపారు. ఆర్జీయూకేటీ విద్యార్థులు ఉమెన్స్‌లైఫ్ స్కిట్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.పావని, కేఆర్‌సీ మూర్తి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

అభిరుచినే ఉపాధిగా మలుచుకుని..



ప్రముఖ నటితో రంగు సౌమ్య

భైంసాటౌన్: నృత్యంపై తనకు చిన్ననాటి నుంచి ఉన్న అభిరుచిని ఉపాధిగా మలుచుకుని రాణిస్తున్నారు భైంసాకు చెందిన రంగు సౌమ్య. తనకు పెళ్లయిన తరువాతనే భర్త రంగు సంపత్‌కుమార్ ప్రోత్సాహంతో నిజామాబాద్‌లో నృత్య గురువులు భీమన్, దేవులపల్లి ప్రశాంత్ వద్ద నాలుగేళ్లపాటు కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంది. అనంతరం భైంసాలో తానే సొంతంగా శ్రీ నయనం నృత్యా కళానిలయం పేరిట చిన్నారులకు నృత్యంలో శిక్షణ అందిస్తోంది. మొదట కేవలం ఐదుగురు చిన్నారులతో ప్రారంభించి, నేడు దాదాపు వందవరకు చిన్నారులు తన వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్నారు.

శిష్యబృందంతో ప్రదర్శనలు..

- అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తన శిష్యబృందంతో నృత్య ప్రదర్శన నిర్వహించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.
- ఇటీవల అరుణాచలంలో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పదిహేను మంది చిన్నారులతో కలిసి నృత్య ప్రదర్శన నిర్వహించారు.
- హైదరాబాద్‌లోని స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్‌బుక్ రికార్డు నృత్య ప్రదర్శనలో సైతం తన శిష్య బృందంతో పాల్గొని గిన్నిస్‌బుక్ వారి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.



హైదరాబాద్‌లో గిన్నిస్ రికార్డు ప్రదర్శనలో శిష్యబృందంతో సౌమ్య

కష్టాలకెదురీదుతూ...

- మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తున్న అనూష
- అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం
- ప్రభుత్వం సహాయం కోసం ఎదురుచూపు



రాథోడ్ అనూష

భైంసాటౌన్: కష్టాలకు ఎదురీదుతూ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది తానూర్ మండలం బామ్ని తండాకు చెందిన రాథోడ్ అనూష. ఆరు నుంచి పదో తరగతి వరకు భైంసాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న అనూషకు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, ఒక అన్న ఉన్నారు. అక్కకు పెళ్లి కాగా, చెల్లి అనారోగ్యంతో ఇంటిపట్టునే ఉంటుండగా.. మరో చెల్లి ఇంటర్ చదువుతోంది. అన్న డిగ్రీ చదువుతూనే నాన్నకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. అనూష భైంసాలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సమయంలో కరాటే మాస్టర్ శ్రీరాముల సాయికృష్ణ పాఠశాలలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చేవాడు. ఈ క్రమంలో అనూష ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాడు. దీంతో కరాటే, కిక్‌బాక్సింగ్, వుషూ మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పలు పతకాలు సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సైతం కైవసం చేసుకుంది. ప్రస్తుతం తను నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్ విద్యనే మరికొందరికి నేర్పిస్తూ ఉపాధి పొందుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక కొన్నిసార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనలేకపోయానని, ప్రభుత్వం ఆదరిస్తే మరింతగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెస్తానని చెబుతోంది.



బంగారు పతకం సాధించిన అనూష(ఫైల్)

డాక్టర్ చదివించడమే లక్ష్యంగా..



కూతురు హన్సికతో స్వప్న, రాజన్న

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన నిచ్చకోల స్వప్న, రాజన్న దంపతులకు హన్సిక ఒక్కరే సంతానం. పెళ్లైన తర్వాత పాపైనా బాబైనా ఒక్కరినే కనాలని నిర్ణయించుకున్నారు. హన్సిక జన్మించాక దంపతులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్నారు. కుమార్తెను ఉన్నతస్థితికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్సీడీసీఎల్‌లో చిరు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాజన్న వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎన్నికష్టాలు వచ్చినా ఒక్కగానొక్క కూతుర్ని డాక్టర్ కోర్సు చదివించాలనుకున్నారు. 1 నుంచి పదోతరగతి వరకు బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదివించారు. ప్రస్తుతం ఆమెకు నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. తమ కూతురు డాక్టరై పేదలకు వైద్యం అందించి తమ కుటుంబ గౌరవాన్ని ఇనుమడింపజేస్తుందని ఆ దంపతులు ఆశిస్తున్నారు.

ఎవరైనా ఒకరే..



కూతురితో అన్నపూర్ణ జీవన్

ఈ రోజుల్లో ఆడబిడ్డ, మగబిడ్డ అని కాదు.. ఎవరైనా సరే.. వారికి మంచి జీవితాన్ని వ్వాలి. మాకు ఒక్క పాప శ్రీకృతి. తనను బాగా చదివించి మంచి భవిష్యత్ ఇవ్వాలన్నదే మా కోరిక. ఆడపిల్లలు సైతం ఒంటరిగా అమెరికా వంటి దేశాలకు వెళ్లి చదువులు, ఉద్యోగాలు చేస్తున్నారు. వారిని మగవారితో సమానంగా చూడాలి. అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి.

జెడ్పీటీసీగా రాణిస్తూ..



బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి

బోథ్: మహిళలకు పదవులు ఉన్నా, వారి భర్తలే పెత్తనం సాగిస్తున్న ఈ రోజుల్లో మహిళా ప్రజాప్రతినిధురాలిగా ఉండి సొంత నిర్ణయాలు తీసుకుంటూ, మండలానికి నిధులు తేవడంలో సక్సెస్ అయ్యారు బోథ్ జెడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి. జెడ్పీటీసీగా బోథ్ మండలంలో తనదైన ముద్ర వేస్తున్నారు. జెడ్పీ సమావేశాల్లో పాల్గొంటూ సమస్యలను అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో సీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.10కోట్ల నిధులు తేవడంలో సక్సెస్ అయ్యారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

Wanted to successful pass Degree and PG in Distance Mode. Contact: 9642656449, 9703116054 [G-801052]

REAL ESTATE

FOR SALE

నిజామాబాద్‌లో బిజినెస్ చేయాలనుకునే వారికి గొప్ప అవకాశం! సిరామిక్ కోటింగ్, PPF, కార్ వాషింగ్ సౌకర్యాలతో కూడిన కార్ డీటెయిలింగ్ షోరూం. Hyd రోడ్, నిజామాబాద్ నందు అమ్మబడును. Contact 7989845658 [Z-795693]

SERVICES

BUSINESS OFFER

మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

WANTED

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233872]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చే దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నిర్మల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వంట గ్యాస్ సబ్సిడీ కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫోన్ నంబర్, ఆధార్, గ్యాస్ కన్స్యూమర్ ఐడీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులలో తప్పులు నమోదైతే వాటివివరాలు సరిచేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో గజానంద్ ఉన్నారు.

పరీక్షలు పద్బందీగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటర్ పరీక్షలు పద్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 5,819 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,588 మంది హాజరయ్యారు, 231 మంది గైర్హాజరయ్యారు.

సమగ్ర ఓటరు జాబితాకు సహకరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం సమగ్ర ఓటరు జాబితాను రూపొందించేందుకు, ఓటింగ్ నమోదు పెంచేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వివిధ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో గంగయ్య, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జగన్‌మోహన్, శ్రావణ్‌రెడ్డి ఉన్నారు.

భారీ ఇసుక డంప్ స్వాధీనం

- వేలానికి అధికారుల ఏర్పాట్లు

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ పరిసర వాగు ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలించి డంప్ చేసిన ప్రాంతాలను గురువారం తహసీల్దార్ స్వాతి, మైనింగ్ అధికారులు పరిశీలించారు. వాగు పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామ పరిసరాల్లో డంప్‌లుగా ఏర్పాటు చేయడాన్ని వారు నిర్ధారణ చేసి గ్రామ పరిసరాల్లో డంప్ చేసిన ఇసుక నిల్వలను సీజ్ చేశారు. దాదాపుగా 153 ట్రాక్టర్ల మేర ఇసుక నిల్వ చేశారని, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టుబడిన ఇసుకను వేలం వేయడం జరుగుతుందన్నారు. సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ప్రభుత్వ ధర రూ.1800 నుంచి నిర్ణయించినట్లు వెల్లడించారు. మొత్తం 153 ట్రాక్టర్లకు రూ.900 చొప్పున రూ.లక్ష 37వేల 700 డీడీ రూపంలో దిలావర్‌పూర్ తహసీల్దార్ పేరిట తీసి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఇందులో దిలావర్‌పూర్ రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

సోన్: పురుగుల మందుతాగి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పాల్దే శ్రీనివాస్(40) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై ఇంటిపని చేయకుండా తాగుతూ తిరుగుతున్నాడు. భార్య, తల్లి మందలించడంతో ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా చేనులో పురుగుల మందుతాగి పడిపోయి కనిపించాడు. దీంతో వెంటనే నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ ఉద్యోగి మృతి

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరిగేషన్ ఉద్యోగి గురువారం ఆస్పత్రిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని జామ్ గ్రామానికి చెందిన మయ్యారి రమేష్(50) గురువారం నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈక్రమంలో అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడు రమేష్ ఆరు నెలల క్రితం రెవెన్యూ డిపార్ట్‌మెంట్ వీఆర్ఏలను తొలగించడంతో అతడికి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లష్కర్ ఉద్యోగిగా విధులు అప్పగించారు. ఈ నెల 5వ తేదీనే మొదటి వేతనం తీసుకుని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఇది వరకు చేసిన 5నెలల వేతనం రావాల్సి ఉన్నా తొలివేతనం అందుకున్న సంతోషంలో ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం అతడిని కబళించింది. భార్య సుశీల రోదనలు గ్రామస్తులను కంటతడిపెట్టించాయి. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి..

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం... మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన తోకల పోశన్న(70) బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ధర్మారం నుంచి కనకపూర్ వైపు వస్తుండగా మార్గమధ్యలో పీచర శివారులోని దుబ్బ రాజేశ్వరస్వామి దేవాలయం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పోషన్న తలకు తీవ్ర గాయం కావడంతో మృతిచెందాడు. మృతుడి భార్య తోకల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని నిర్మల్‌లోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.